# లక్షిందేవి

[మోపాసా నించి]

సాయింత్రపు కాంతి బందరు కాలవ బురదనీటిని ఆకాశగంగగా మార్చింది. తూరుపున కాలవకి అడ్డంగా వున్న కొండనీ, పడమట నల్లగా ఆకాశానికి అడ్డన్న వంతెననూ నేరేడు చెట్లవరుస కలుపుతూ వుంది. కింద పచ్చనిగడ్డి, పైన యెర్రని ఆకాశం, మధ్య చల్లని క్రిష్ణగాలి, దయ గల ప్రియురాలివలె పగలంతా తాపత్రయపడ్డ మనసుని జోకొడుతోంది, ఆ స్తల సౌందర్యం.

"మాస్కూలు యీ చెట్లకింద పెడితే, కొంతబాధ తగ్గుతుందేమో మాకూ-పిల్లలకి కూడా-"

"వానవాస్తే-"

అంటో వెంకట్రావు పక్కకి తిరిగి చూస్తున్నాడు. ఒక్కత్తె అందమైన స్త్రీ మెల్లిగా నడుస్తో అట్లా వెడుతోంది. ఆమె చేతులకీ, మెళ్ళోనూ, నగలు తళతళమన్నాయి, నా కళ్ళమీద ఒకనిమిషం. ఆ నగల కన్న తానెంత అందమైందో చూపడానికి వాటిని ధరించినట్టు కనపడ్డది.

"నీకు తెలుసుగా ఆమె - లక్షిందేవి-"

"నాకు తెలీదు ఎవరామె ?"

"నిరుడు లేవుగా నువ్వీ వూళ్ళో-అన్నట్లు, చెప్పనా"

"కానీ-"

"పోయిన యేడు యీామె భర్తకి యీవూరు బదిలీ అయింది. అతని కేదో ఆఫీసులో హెడ్డుమాస్టాపని - మంచి జీతమే - మొదట్లో యీామె సంగతి యెవరికీ తెలీదు-ఎవరిక్కావాలి ? కాని కాంతారావు నాయుడు యీవూరు హెడ్క్వార్టర్సు చేసుకోడంతో మొదలు - ప్రజలదృష్టి యీామె మీద పడడం. అతను వీళ్ళయింటి కెదురుగా వున్న మేడలో అద్దెకున్నాడు. ఈమే, కాంతారావు నాయుడూ, పోలీసు యిన్స్పెక్టరు చౌదరీ కలిసి తిరుగుతూవుంటే చూసి, యీామె యెవరనీ, యీామె పూర్వచరిత్ర యేమిటనీ ప్రజలు ఆచోకీ మొదలుపెట్టారు. మా బార్రూములో మేం కూడ బలుక్కుని తెలుసుకున్న సంగతులివి. ప్లీడర్లలో ఆమె బంధువు డొకడున్నాడు. వాడిమూలాన మా క్యూరియాసిటీ సంతుష్టిపడ్డది.

అసలు హెడ్డుమాస్టాని చూస్తే ఈమె కెన్నడూ, యిష్టంలేదు. ఇష్టంలేని సంగతి వాళ్ళిద్దరూ కలిసివుండగా చూచినవాళ్ళందరికి అర్థమౌతుంది "ఎన్నటికన్నా ఈమె నాది కాగలదా? ప్రతివాళ్ళతో యింత ఆప్యాయంగా మాట్లాడుతుందే! నా ఖర్మమేనా? నేనసలు లేనట్లేచూస్తుంది!" అనే అతని చూపూ, "నన్ను క్షమించండి, ఈయన నాభర్త. నేనేం చెయ్యను, ఎట్లా తప్పించుకోను?" అనే ఆమె చూపూ, ఎన్నో కథలు చెప్పేవి దగ్గిర వున్న వాళ్ళకి. పైగా తనకి బాగా చనువైనవాళ్ళతో లక్షిందేవి "ఇంక గతిలేక పడివుండడంగాని, ఈయనవల్ల నాకేమన్నా సౌఖ్యం వుందనా?" అనేది. ఆ సౌఖ్యం అనేమాటను అనేకమంది అనేక విధాల అర్థం చేసుకునేవారు. అందులో ఆయన అవతారం బహులావుగా వుంటుంది. మాట బహు నచ్చు- యీడుస్తో మాట్లాడతాడు. రూపం చాలా గంభీరమన్న మాటేగాని మనసు బహు పిరికి. పెద్ద నున్ననిగుండూ, ఒక పొడుగాటి పిలకా. వాటిని కప్పడానికి తలపాగ పెడితే మనిషి మహ బాగా వుంటాడు. "నాకే కోపమొచ్చిందా"- అని భీకరంగా చూస్తాడు. ఎదటి వాళ్ళకి నవ్వుబుద్దేస్తుంది. రివాల్వరు లేదు. "ఎవడన్నా నన్నోమాట

అన్నాడా, గుండు పెట్టి కాలుస్తా" అంటాడు. కాని ఎవడూ ఎదురు ఏమీ అనడు, ఎందుకంటే రివాల్వర్ లేదని అందరికి తెలుసు వున్నా అది చిన్నపిల్లల టుపాకీ, తూటాలుండవు. కిందపడితే లేవలేడు. కళ్ళుమాత్రం "ఇట్టా వున్నానన్న మాటేగాని, ఎంత బలమనుకున్నా రేం!" అంటాయి.

ఎదరమేడలో వుండడంచేత కాంతారావునాయుడికి, గుమాస్తాగారికీ, స్నేహమవడం సహజమనీ, కానీ లక్షిందేవితో స్నేహంకావడం అసహజమనీ అనిపించింది. క్రమంగా నాయుడుగారికి గుమాస్తాగారికంటె లక్షిందేవిగారితోనే పరిచయమెక్కువేమో అనిపించింది. గుమాస్తాగారికి పదకొండు మొదలు ఐదింటిదాకా ఆఫీసు పోలీసు సూపరెంటుగారు, తమ యిష్టంవచ్చినప్పుడు ఆఫీసుపని చేసుకోవచ్చును కనక పదకొండింటి దగ్గర్నించి తీరుబడి చేసుకునేవారు.

కొద్దిరోజుల్లో పోలీసు యిన్‌స్పెక్టరు చౌదరీగారి కారుమీద అందరూకలిసి కొండపల్లి షికారు వెళ్ళేవారు ఆదివారాలు మాత్రం. లక్షిందేవిగారికి యిట్లాంటి "ట్రిప్పులు" అమితమైన యిష్టం. కొండపల్లికిల్లా వంకర దారుల్లో పక్కమనే ఆమెనవ్వు విని అడివిపిట్టలు కూతలు మాని వినేవి. కొండల్లో ప్రతిధ్వనించే ఆమె సంగీతాన్ని ఆవులు చెవులు నిక్కబొడుచుకొని విని తలనాడించేవి. నాయుడుగారూ, లక్షిందేవిగారూ ఆ అడివి రామణీయకాన్ని ఒకరికళ్ళల్లో ఒకరు ప్రతిఫలించగా చూచుకొన్నారు.

ఒకరిమీదనుంచి ఒకరు కళ్ళు తిప్పుకోలేక కొండవాళ్ళ మీదనించి కిందికి జారారు, జారకుండా చేతులందించుకున్నారు. చీకట్లో తిరిగి వచ్చేప్పుడు మోటారు వూపులకి, కునికిపాట్లమత్తులకి, ఒకరి దేహాలు ఒకరికి బరువుగా అనుకునేవి. వారంలో మిగిలిన ఆరు రోజులు ఆమె ఒంటరిగా

కూచుని, గడచిన ఆదివారాన్ని, రాబొయ్యే ఆదివారాన్ని తలుచుకుని పులకరించేది, కలలు గనేది. సాయంత్రం యింటికి చేరుకుని పెద్దు గుమాస్తాగార్ని రోడ్డుమీదే చూచి బుజాలు కిందికి జారే ఆయన పాతకోటు కప్పిన వంకర చాతీని, వదులు పంట్లాము ఈడ్చుకొంటో నడిచే నీరస పద్ధతిని నాయుడుగారి పూపునడకతో పోల్చుకోలేకుండా వుండలేకపొయ్యేది ఆమె.

ఒకరోజు మధ్యాహ్నం నాయుడుగారు లక్షిందేవి చెయ్యిపట్టుకుని తన ప్రేమని వెలిబుచ్చాడు. ఆమెని చూసినప్పణ్ణించి తాను పడే అవస్థని తెలియచేశాడు. చాలా రోజులనించి ఆమె ఎదురుచూస్తోంది యింకా పురుష నామముగల ప్రతివాడూ, సహజంగా మాట్లాడవలసిన ఆ అమృతవాక్కు అను మాట్లాడకుండా ఎందుకు దాస్తున్నాడా అని. అతని కళ్ళలోని ధీర త్వం పెదవుల కెందుకు లేదా అని. నాయుడుగారు చెయ్యిపట్టుకోగానే వొళ్ళు ఝల్లుమన్నది. ఆరురోజుల "టెన్షన్" ఒక్కమాటు వొదిలి ఆమె నరాలు హాయిగా అతని భుజంమీద విశ్రాంతిని పొందాయి. అతని మాటల్లోని మాధుర్యమంతా కళ్ళతో తాగి, ఒక్క చిరునవ్వు నవ్వి వూరు కుంది ఆమె చేతిని గట్టిగా వొత్తి సంతుష్టిపడి ప్రస్తావన మార్చేశాడు. అనుభవశాలి గనక నాయుడుగారు ఆమె హృదయం తనదని తెలియగానే సంతోషించి నమ్రతగా ఆమె శలవు తీసుకుని మళ్ళీ వొస్తానన్నాడు. ఆమె కళ్ళలో ఆశకోసం వెతుకుతో తానింతవరకు ముందుకు జరిగాడు. ఇక

తనకోసం తపన పడడం ఆమె వొంతు అనుకున్నాడు. తను వేటాడటం అతనికి చాలా మామూలు, తను వేటాడబడే అనుభవాన్ని కొత్తగా వెతుకుతున్నాడు సూపరెంటు.

కాని స్త్రీకి వుండే నిబ్బరానికి పురుషుడు తట్టుకోగలడా? పదిరోజుల సర్వేటునించి తిరిగివొచ్చాడు. లక్షిందేవి నించి ఒక పలుకులేదు. మాట లేదు. నాయుడుగారి ఆశలు అడుగంటాయి. చకచకా మధ్యాహ్నం ఆమె యింటికి నడిచివెళ్ళాడు, కాళ్ళు కాలుకుంటో. మరి ఆమె కనపడితే ఏమి జరిగేదో ఏమో! గుమ్మంలోనే కలుసుకున్నాడు గుమాస్తాగారు.

నా పెళ్ళానికి నువ్వు రాసిన చీట్లు చూశాను. నువ్వు బుద్ధిమంతుడవని నిన్ను రానిచ్చాను. నన్నిట్టా నమ్మక ద్రోహం చేశావు. ఇంక నా గుమ్మం తొక్కకు అని, నాయుడుగారు విభ్రాంతుడై చూస్తోవుండగా, తలుపేశాడు. హడిలిపోయినాడు సూపరెంటు. లక్షిందేవికి ఎంతమాత్రం జరిగిన సంగతి తెలుసు? ఆమెని వీడేం జేశాడు? ఆమె లొంగిపోయిందా లేదా? అనే సమస్యలలో పడి కొట్టుకొన్నాడు రాత్రింపగళ్ళు. ఇంత కాలం వృధాచేశానే, చేతిలో అదృష్టం జారవిడిచానే, అనే తననితాను తిట్టుకుంటో ఆమె బుజాలను మెడను, కళ్ళముందు కల్పించుకుంటో ఆమె వాంఛ ఎంత తీవ్రమైనదో, ఎంత కామోద్రేకం ఆమె తనమీద చూపించి వుండునో అని ఆశపడుతో నరకబాధ పడ్డాడు. ఎప్పుడూ మేడ కిటికీ దగ్గిరే నివాసం. ఎన్ని గంటలు కూచున్నా కనిపించదు. కనిపించినా తల

ఎత్తడు. హెడ్డుమాస్తాని కూనీ చేయించే ఆలోచనలు కూడా తన మన సులో కనిపెట్టి ఆశ్చర్యపడ్డాడు నాయుడుగారు.

అదృష్టదేవత తనవేపు మళ్ళీ కళ్ళు తిప్పుతుందని ఎన్నాళ్ళు కాచుకునివున్నా లాభంలేకపోయింది. చివరికి నిరాశ చేసుకుని ధ్యాస టింకో వేపు మరల్చడానికి చూస్తో వుండగా, ఒక వుదయం చీటీ వచ్చింది.

"ఆయన మధ్యాహ్నం వూరికి వెడుతున్నారు. ఒకసారి కన పడండి"

మధ్యాహ్నం హెడ్డుమాస్తాగారి బండి రైలుకి కదిలిందాకా వుండి చప్పున లక్షిందేవివారి యింటికి పరుగెత్తాడు.

"మళ్ళీ ఎప్పుడొస్తాడు?" అన్నదే అతని మొదటి ప్రశ్న.

"మూడు రోజులకి"

చప్పున ఆమె పాదాలమీదపడి వేడుకున్నాడు, తన ప్రాణం నిల బెట్టమని తడబడే మాటలతో. దినాలన్నీ తనుబడ్డ బాధనంతా ఆమె హృదయానికి వినిపించడానికి ప్రయత్నించాడు. ఆమె చివాలున లేచి పక్కగది గుమ్మం దగ్గరికి వెళ్ళి,

"నే నట్టాంటిదాన్ని కాను. చాలా పొరబడ్డారు" అని లోపలికి వెళ్ళి తలుపువేసుకుంది. మళ్ళీ బైటికి రాలేదు.

ఆమర్నాడంతా నాయుడుగారి ఆఫీసులో గుమాస్తాలకి జవాన్లకి ఎడతెరిపి లేకుండా చీవాట్లు తగిలాయి. నిష్కారణంగా జుల్మానాలు, బదిలీలు, సస్పెన్షన్లు, యిష్టమొచ్చినట్లు తలావోటి విసిరాడు.

మర్నాడు భోజనానికి కూచోపోతూవుండగా ఇంకో చీటి పట్టుకొచ్చాడు జవాను.

"ఈ రాత్రి పన్నెండింటికి—లక్ష్మి"

సాయంత్రంలోపల, ఫైల్లు, సస్పెన్షన్లు, బదిలీలు, అన్నీ రద్దయిపోయినాయి. సాయంత్రం నిమిషాలు లెక్కచూసుకుంటో యిటూ అటూ తిరుగుతూ వుండగా, మళ్ళా చీటీ వచ్చింది.

"రాత్రి పదింటిరైలులో ఆయన వొస్తున్నారు, వీలుపడదు."

చీటీ తెచ్చిన జవాన్ని నడుంమీద తన్ని "నీ పాడు మొహం నాకు చూపించకు; నిన్ను మాచర్ల ట్రాన్సఫర్ చేశాను. పో - పో వెంటనే" అన్నాడు.

ఇట్లా అయిపోయినాయా తన ఆశలన్నీ ఆఖరు నిమిషాన! ఆ రాత్రి రమ్మంటేమాత్రం తానెందుకు ఆగాలి, అప్పుడే వెళ్ళక! మళ్ళీ యెప్పుడు వూరికి వెడతాడా చచ్చు పీనిగ; పెళ్ళాన్నంటిపెట్టుకుని అట్లా పడివుంటాడు గాని! ఈ లోపల తనకు బదిలీఐతే! వాళ్ళకైతే! ఆమె మనసు మారితే! ఏమైనాసరే ఆ రాత్రి తానిక తప్పిపోతే యింక జన్మానికి తనకి మళ్ళీ వీలు గలగదు అందులో అట్లాంటి స్త్రీ జన్మానికి ఒకసారి కంటె-అట్లాంటి వరం దేవతలివ్వరు. కాని ఆ మొగుడు తిరిగి వొస్తున్నాడే? యెట్లా? పూర్వం కూనీలు చేయించేవారు. అంతమాత్రం ప్రయోజకులీ క్షుద్ర నాగరికతా నిస్సత్తువ యుగంలో యెవరూ కనపడరు. చప్పున మంచి ఆలోచన తోచింది. చంపకపోతేనేం? ఆ రాత్రి చచ్చేట్టు చేస్తేచాలు. తొరగా పోలీసు చౌదరీగారి యింటికెళ్ళి గదిలో రహస్యంగా మాట్లాడాడు.

"పైకి వాస్తే నా నౌకరీ, నలుగురు జవాన్ల నౌకరీ వూడుతుంది."

"ఏమీ రాదు. నేను పూచీ"

"కాని, స్నేహానికి మరి సాహసం చెయ్యాలి."

ఇద్దరూ నవ్వుకుంటూ బైటికి వొచ్చారు. లక్ష్మిందేవికి చీటీ వ్రాశారు.

"నీ భర్త యీ రాత్రికి రాడని నాకు తెలుసు. నన్ను నమ్ము. భయపడకు. నాకోసం ఎదురుచూడు."

పదకొండింటికి రైలుదిగి హెడ్డుమాస్తాగారు స్టేషనురోడ్డున చెట్లకిందనించి యింటికి వస్తున్నాడు. ఎవడో తాగినవాడు పాడుకుంటూ వొచ్చి మీదికి తూలాడు. రివాల్వర్లు పేల్చే హెడ్డుమాస్తాగారు భయంతో పక్కకి తప్పుకొని తన దోవన తలొంచుకొని వేగం సాగించాడు.

"వెధవా! మీదపడతావేంరా!" అని వెంబడించాడు మీదపడ్డ వాడు.

"నా మూటయేది? నా మూట!" అన్నాడు పైగా.

"నీ మూటయేమిటి?"

"ఏమిటా! ఏమిటా! ఒరి దొంగముండా కొడకా" అని తిట్లు ప్రారంభించాడు.

"హాహో తాగి అట్టే పేలక?"

"తాగానా, నేనా నువ్వా తాగింది" అని గుమాస్తాని కొట్టి 'దొంగ దొంగ' అని కేకేశాడు.

సందు మలుపులోంచి యిద్దరు పోలీసు జవాన్లు దీపం పట్టుకొచ్చి "ఏమిటీగోల ? స్టేషన్కి నడవండి" అన్నారు.

హెడ్డుమాస్టా తనసంగతి చెపుతున్నాడు. ఆ మాటలు వినపడకుండా తాగినవాడు అరుస్తున్నాడు. దగ్గిరవున్న స్టేషన్కి తీసుకుపోయినారు. అక్కడ వున్న ఆయన,

"లాకప్పులో పడెయ్యండి రేపు విచారిద్దాం" అన్నాడు.

"నేను హెడ్డుమాస్తాని"

"నేను కలెక్టర్ని" అన్నాడు రెండోవాడు.

"ఈ గదిలో వీణ్ణి, ఆ గదిలో వాణ్ణీ వెయ్యండి, లేకపోతే తన్ను కుంటారు."

హెడ్డుమాస్తాని లోపలికి తోసేసి, ఆ తాగినవాడూ జవాన్లూ ఒకళ్ళ నొకళ్ళు కావిలించుకొని బిగ్గిరగా నవ్వారు.

ఆ రాత్రంతా హెడ్డుమాస్తాగారు బొద్దింకల్ని లెక్క పెడుతూ కూచున్నారు.

పొద్దున్నే తలుపుతీసి సార్జంటు, హెడ్డుమాస్తాని గుర్తుపట్టి "ఏదో గ్రహచారం, రోజూ పుచ్చుకునే దానికన్న కొంచెం ఎక్కువ పడ్డట్టుంది. మర్యాదస్తులు మీమీద కేసేమిటి ? దయచెయ్యండి. ఒరే ! ఆ రెండో.... గదిలోవాణ్ణి మెత్తగా తన్ని పంపించండ్రా" అని హెడ్డుమాస్తాగారు చెప్పే కోపంమాటలు విననట్టు సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

అక్కడున్న జవాన్లు తలన్నాయెత్తి చూడకుండా వాళ్ళ పనిమీద వాళ్ళున్నారు.

ఇంటికివెళ్ళి చార్జీ యిద్దామా అని ఆలోచించాడు. సాక్ష్యమేముంది ? ఎవరు నమ్ముతారు ? తాను కొట్లో రాత్రి గడిపినసంగతి బైటికివస్తే, చార్జీ యిచ్చేవాడే. అతనికి తానుపడ్డ కష్టం తీరదు. పైగా వూళ్ళో నవ్వులాట-ఇంతకీ పోయిందేముంది! అనుకున్నాడు. కన్న ప్రాణంకన్నా అమూల్యంగా చూసుకునేది ఒకటి పోయిందని తెలీలేదు. ఎట్లా తెలుస్తుంది ?

కళ్ళుబ్బి రాత్రంతా నిద్రలేని భార్య తలుపుతీసింది.

"రాత్రి రాలేదేం ? తెల్లవార్లు మిమ్మల్నెదురు చూస్తో నాకు నిద్రే పట్టలేదు" అంది.

అని చెప్పి వూరుకున్నాడు వెంకట్రావు, ఆలోచిస్తో కూచున్నాము.

చీకటి పడ్డది. పిట్టలరుపులు మానాయి. ఆమె తిరిగి యింటికి వెడుతోంది. ఆ చీకట్లో యెక్కడవుందో ఆమెదృష్టి ! ఏమాలోచిస్తోంది ? నాయుడుకి బదిలీ అయి చాలా కాలమయింది. ఆ వొక్క రాత్రి తాననుభవించిన ప్రేమను గురించి ఆలోచిస్తోందా ? పశ్చాత్తాపమా ? విరహమా ? తన పరువు, స్నేహితుడి వుద్యోగం, ధారపొయ్యడానికై తెగించిన ఆ వొక్కరాత్రి కోసం నాయుడుగారిని తలుచుకుంటోందా ? చౌదరీగారి మిత్రభావాన్నా ? ఏమాలోచిస్తోందో

నాయుడుగారు, ఆయన ఏంచేస్తున్నారో ! అనంతపురంలో—మరచిపోయినాడో ! లేక క్లబ్బులో 'బ్రిడ్జి' ఆటలో ఆ రాత్రి సాహస ప్రజ్ఞనుగూర్చి కొత్త స్నేహితులకు చెపుతున్నాడో !

★